క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై చర్యలు

కాటారం: మండలంలోని గంగారం ఎక్స్ రోడ్డు వద్ద అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతున్న వారికి ఎంపీఓ ఆదేశాల మేరకు గతంలో నోటీసులు జారీ చేయడంతో పాటు నిర్మాణ సామాగ్రి సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల బృందం అక్రమ నిర్మాణాలను నిలిపివేసి నిర్మాణదారులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. నిర్మాణాల ఎదుట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని అక్రమంగా నిర్మిస్తున్న భవనాలకు గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి ఇంటి నంబర్లు కేటాయించలేదని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కాటారం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి, ర్యాంపు సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, గిర్దవరి వెంకన్న, పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి, సిబ్బంది ఉన్నారు.

నిరసన

భూపాలపల్లి అర్బన్: కక్ష పూరితంగా తనను పనిలో నుంచి తొలగించారని ఆరోపిస్తూ మధ్యాహ్న భోజన కార్మికురాలు భూమమ్మ శుక్రవారం మండలంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పొన్నాల భూమమ్మ 15 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేశారు. రెండు నెలల క్రితం పాఠశాల ఉపాధ్యాయులు అకారణంగా తొలగించారని ఆరోపించారు. గత ఆరు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సన్మానం



చిట్యాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. దీంతో శుక్రవారం అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య ఆధ్వర్యంలో భిక్షపతిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఏవైఎస్ మండల నాయకులు గుర్రం తిరుపతి, రాజమౌళి, పాముకుంట్ల చందర్, కట్కూరి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: ఉత్తమ విద్యుత్ ఏఈగా అవార్డును అందుకున్న మణిదీప్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని సెక్షన్ కార్యాలయంలో సహోద్యోగులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్‌లు నారాయణ, కిరణ్, సురేందర్, రమేష్, గవాస్కర్ ఉన్నారు.

మాజీ వైస్ చైర్మన్‌ను సన్మానించిన కేటీఆర్



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డిని శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో సన్మానించారు. ఇటీవల పురపాలక సంఘాల పదవి కాలం ముగియగ పాలకవర్గ మాజీ ప్రజాప్రతినిధులను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సన్మానించారు.

మండల కమిటీ ఎన్నిక



మహేశ్, అధ్యక్షుడు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో డీటీఎఫ్ ఉపాధ్యాయ మండల కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోటపల్లి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, రాణి, రాజేందర్ కార్యదర్శులుగా ఎల్ రాజేశ్వరరావు, సీహెచ్ వెంకటస్వామి, అబ్దుల్ రహీం, ఇందిర, జిల్లా కౌన్సిలర్స్‌గా శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, రవీందర్‌రెడ్డి, రవీందర్ ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఉయ్యాల సురేందర్, ఆడిట్ కమిటీ సభ్యులుగా శ్రీలత, బి మౌనిక ఎన్నికయ్యారు.

'తెల్ల బంగారం' చేతికొచ్చేనా?

- కూలీల కొరతతో పత్తి రైతులకు తిప్పలు
- చెట్లపైనే రాలిపోతున్న పత్తి



కొత్తపల్లిగోరిలో చెట్లపైనే రాలిపోతున్న పత్తి

రేగొండ: ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అరకొర పండిన పత్తి తీయడానికి కూలీల కొరత కారణంగా వందల ఎకరాల్లో పత్తి చెట్లపైనే రాలిపోతుండటంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 12 వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశారు. ఇప్పటి వరకు మొదటి విడత మాత్రమే పత్తి తీశారు. తర్వాత పత్తి తీసేందుకు కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. ఒకవైపు పత్తి పంటకు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించక ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట చేనులోనే చెట్లపై కారిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చెట్ల పైనే పత్తి పాగ మంచుకు తడిసి ఎండకు ఎండిపోవటంతో రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తితీతకు కూలీలు ఆసక్తి చూపడం లేదని కేజీకి రూ.25 నుంచి రూ.30 ఇస్తామన్నా రావడం లేదని రైతులు చెపుతున్నారు. రోజుకు రూ.500 కూలీ ఇస్తామన్నా వచ్చేవారే లేరని వాపోతున్నారు. ఒకవైపు మిర్చి కోతలు, మరోవైపు యాసంగి నాట్లు ఉండటంతో పత్తి తీసేందుకు కూలీలు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతలో ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్లు రాగా, రెండోసారి 4 నుంచి 6 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉన్నా పత్తి తీసేందుకు కూలీలు లేక పంట చేనులోనే పాడైపోతుందని వాపోతున్నారు.

గిట్టుబాటు ధర రావడం లేదు..

మార్కెట్‌లో నాణ్యమైన పత్తికి కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ ఏడాది 5 ఎకరాలలో పత్తి సాగు చేశా. అధిక వర్షాల కారణంగా దిగుబడి తగ్గింది. రెండు ఎకరాలలో పత్తి తీశాం. ఇంకా మూడు ఎకరాలలో చెట్లపైనే కారిపోతుంది. కేజీకి రూ.30 ఇస్తామన్నా కూలీలు రావడం లేదు. ఈ ఏడాది పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా లేదు.

- జంగేటి సంజీవ్, రైతు, రామన్నగూడెం

పత్తి రాలిపోతుంది..

ఈ ఏడాది రెండు ఎకరాలలో సాగు చేసిన పత్తి పంట కూలీల కొరత కారణంగా చేనులోనే పత్తి రాలిపోతుంది. మూడో విడత పత్తి తీయాల్సి ఉంది. కూలీలు రాకపోవడంతో మేమే పత్తి తీస్తున్నాం. రోజు కూలీ రూ.500 ఇస్తామన్నా కూలీలు రావడం లేదు.

- గురుప్రసాద్, రైతు, కొత్తపల్లిగోరి

మిరప తోటల పరిశీలన



మిరప తోటను పరిశీలిస్తున్న అధికారులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలోని మిరప తోటలను భూపాలపల్లి డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఎడ్ల సునీల్‌కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రైతులు ఓ కంపెనికి చెందిన మిరప విత్తనాలు కొనుగోలు చేసి పంట వేసిన తరువాత కాతపూత సరిగా రావడం లేదని రెండు రోజుల క్రితం వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రావుల సురేష్, దూదిపాల బుచ్చిరెడ్డి, జయపాల్‌రెడ్డిలకు చెందిన మిరప తోటలను పరిశీలించినట్లు తెలిపారు. మిరుప తోటలో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే శాస్త్రవేత్తలను క్షేత్రస్థాయిలో సందర్శించే విధంగా నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమణకుమార్, రైతులు దుబాసి నర్సయ్య, సమ్మిరెడ్డి, సామాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

టేకుమట్ల: టేకుమట్ల క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, సామూహిక సీమంతాలలను ఘనంగా నిర్వహించారు. పిల్లలకు అన్నప్రాసన సందర్భంగా ఉగ్గు తినిపించారు. అలాగే గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి దంపతులకు దుస్తులను బహూకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా మోతాదులో పోషకాలు ఉన్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాసమల్ల స్వప్న, మేకల నిర్మల, భాగ్యలక్ష్మీ, తిరుపతమ్మ, విమల, చంద్రకళ, నిర్మల, నీల, హిమబిందు, రమ్య, విజయ, వరుణ, పద్మ, శైలజ, వనమాల, సుమలత, వంగ వనమాల, సునీత, స్వరూప, వనిత, రమ, శ్రీదేవి, ఆయాలు లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పాటతో ఉద్యమానికి ఊపిరి పోసిన గద్దర్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పాటలతో గద్దర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశాడని, సమాజంలో ఉన్న అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన గొంతుక గద్దర్ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గద్దర్ జయంతి సందర్భంగా భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గద్దర్ జయంతిని ప్రజా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, ఆయన పేరుతో అవార్డు నెలకొల్పి ప్రతి ఏటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రదానం చేయాలని నిర్ణయించదని తెలిపారు. భూపాలపల్లి మంజూరునగర్ సెంటర్లో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కవులు,కళాకారులు , కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో జగద్గురు శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో తుని తపోవన పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతిస్వామి చేతుల మీదుగా లోక కల్యాణార్థం ఈనెల 7నుంచి 9 వరకు కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7న శుక్రవారం నుంచి 9న ఆదివారం వరకు మూడు రోజులు శతచండి మహారుద్ర సహస్ర ఘటాభిషేక కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9న ఆదివారం ఉదయం 10.42 గంటలకు మహా కుంభాభిషేకం 1,180 కలశాలతో 1,331 ఆవర్తనాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు గోపురాలు, స్వామివారి గర్భగుడి గోపురాలతో పాటు శ్రీశుభానందదేవి, సరస్వతిఅమ్మవారు, ఇతర దేవాలయాలన్నింటికి కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుంభాభిషేకములో పాల్గొను రూ.2,516లు చెల్లించాలని పూజా అనంతరం శేష వస్త్రాలు, కలశ ప్రసాదం ఇవ్వనున్నట్లు తెలిపారు. విరాళం చెల్లించువారు దేవస్థానం కౌంటర్‌లో లేదా కార్యాలయంలో నగదు చెల్లించి రసీదు పొందగలరని సూచించారు.

'చలో వరంగల్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం: బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 2న వరంగల్‌లో నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధభేరికి బీసీ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీసీ సంఘాల నాయకులు సంపత్, విజ్జగిరి సమ్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలోబీసీ కుల సంఘాల నాయకులతో కలిసి హలో బీసీ–చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలన్నారు. బీసీల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం తీసుకురావాలని, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం నిర్వహించనున్న బీసీ యుద్ధభేరికి తరలివచ్చి ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు దబ్బెట రాజేశ్, శంకర్‌గౌడ్, వెంకట్రాజం, చీమల రాజు, అంగజాల అశోక్, కొట్టె ప్రభాకర్, పసుల మొగిలి, కొట్టె సతీశ్, అందె భాస్కరచారి, మాచెర్ల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై తమాషారెడ్డి

కాళేశ్వరం: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. శుక్రవారం కాళేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఆటోడ్రైవర్లతో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతో కాళేశ్వరం ఆటో యూనియన్ సభ్యులతో రోడ్డు భద్రతకు సంబంధించిన నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పోలీస్ స్టేషన్ నుంచి కాళేశ్వరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

భూనిర్వాసితులు ఆందోళన చెందొద్దు



చిట్యాల: రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

- ఆర్డీఓ రవి

టేకుమట్ల: గ్రీన్‌ఫీల్డ్ హైవేలో వ్యవసాయ భూములను కోల్పోతున్న భూనిర్వాసితులకు అందే పరిహారంలో ఎవరూ ఆందోళన చెందవద్దని ఆర్డీఓ ఎన్.రవి అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేలో వ్యవసాయ భూములను కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. పరిహారం సైతం సత్వరంగా అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని చెప్పారు. రైతులు కూడా గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం సహకరించాలన్నారు. ప్రతీ రైతు అపోహలకు లోనుకాకుండా అధికారులకు సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్‌ఐ సంతోష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

చిట్యాల: నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే గ్రామాలలోని రైతులకు ఏదైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.రవి అన్నారు. శుక్రవారం మండలంలోని గిద్దెముత్తారం , కాల్వపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పనులను ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు ఏలాంటి ఆటంకాలు కలుగకుండా చూడాలని రైతులను కోరారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ హేమ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అంబట్‌పల్లిలో సివిల్ రైట్స్‌డే

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో అంబట్‌పల్లిలో సివిల్‌రైట్స్ డేను తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. అంటరానితనం, వివక్షతను నిర్మూలించాలని అన్నారు. ఆర్‌ఐ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

సివిల్‌రైట్స్‌డేకు సంబంధిత ప్రభుత్వ అధికారులు హాజరుకాలేదని వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల శాఖ అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వచ్చే సివిల్‌రైట్స్‌డే వరకు హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట నాయకులు లింగాల రామయ్య, దళిత సంఘ నాయకులు దీకొండ మల్లేష్ పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



కాటారం: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ



కాళేశ్వరంలో..

- మండల విద్యాధికారి శ్రీదేవి

కాటారం: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని భవిష్యత్‌లో శాస్త్రీయ, సాంకేతిక రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి శ్రీదేవి అన్నారు. ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన అభిరాగవన్ కల్యాణ్, మణిదీప్, మేఘనకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానం పెంపొందించుకోవడం వల్ల ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉమారాణి, సైన్స్‌ఫోరం జిల్లా కార్యదర్శి గండు రాజబాబు, మండల ఇంచార్జి పద్మజ, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంపత్, లక్ష్మయ్య, నళిని, రాజయ్య, పరంసింగ్, మనోహర్ రెడ్డి, జ్యోతి, మౌనిక, శ్వేత పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

చిట్యాల: విద్యార్థులు చదువులో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరం నిర్వహించిన భౌతిక రసాయనశాస్త్ర ప్రతిభ పోటీ పరీక్షను మండల కన్వీనర్ గొర్రె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రఘుపతి హాజరై మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాలలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని తెలిపారు. ఈ పోటీల్లో అజయ్ ప్రథమస్థానం, శృతిక ద్వితీయ స్థానం, రమ్యశ్రీ తృతీయ స్థానాల్లో నిలువగా షీల్డ్‌లను బహూకరించారు. ఉపాధ్యాయులు కల్పన, రహీంపాషా, రాధిక, స్వాతి, రాజు, లక్ష్మీ, సిరివెన్నెల పాల్గొన్నారు.

కాళేశ్వరం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో కాళేశ్వరం విద్యార్థి కటుకు అలేఖ్య ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. గతంలో జీవశాస్త్రంలో కూడా పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం బాసిరి అన్నపూర్ణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు దొనికల రాజేందర్, బయోసైన్స్ ఉపాధ్యాయురాలు సువర్ణలను ప్రత్యేకంగా అభినందించారు. రెండవ బహుమతి మసక యక్షిత, మూడవ బహుమతి మహ్మద్ ఇక్రాలు సాధించారు. ఎస్సై పవన్‌కుమార్, హెచ్‌ఎం బండం రాజిరెడ్డి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మడక మధు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరావాలి

- మిట్టపల్లి సురేందర్



భూపాలపల్లి రూరల్: మట్లాడుతున్న సురేందర్

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్‌లో ఫిగ్రవరి 7న నిర్వహించే మహాసభకు మాదిగలు తరలిరావాలని గేయ రచయిత మిట్టపల్లి సురేందర్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వేల గొంతుకల లక్ష డప్పుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న, పుల్ల శ్రీనివాస్, శ్రీనివాసు, అనిల్ కుమార్, భద్రయ్య, రాజు పాల్గొన్నారు.

గణపురం: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్షడప్పులు వేల గొంతులు మాదిగల సాంస్కృతిక భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని లక్ష డప్పులు వేల గొంతుల రాష్ట్ర కో ఆర్డినేటర్ మిట్టపెల్లి సురేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలకేంద్రంలోని కోటగుళ్లలో శుక్రవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉద్యోగుల అధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్, అడువాల తిరుపతి పటేల్, రఘోత్తం రెడ్డి, దూడపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచి



ప్రభాకర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

టేకుమట్ల: సమాజానికి ఉపాధ్యాయులే దిక్సూచి అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జినుగు ప్రభాకర్‌రెడ్డి పదవి విరమణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. 35 సంవత్సరాలు ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దిన ఘనత ప్రభాకర్ రెడ్డిది అన్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి దంపతులకు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హకీం, సునీల్, మియాపురం జగన్నాదం, జిల్లా ఉపాధ్యక్షులు మేకల సదయ్య, మహేందర్, సోమిడి స్వామి, ముత్యంరెడ్డి, ఉమాదేవి, పృధ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దావు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రావుల శ్రీనివాస్, సిరిపెల్లి సారన్న, ప్రధాన కార్యదర్శిగా రావుల సురేష్, కోల్లూరి మొగిలి, కార్యదర్శులుగా అరెల్లి కుమారస్వామి, జంగా లక్ష్మన్, అల్లే స్వామి, మ్యాదరి రాజు, నోముల వేణు, కోశాధికారిగా పోలపల్లి సుధాకర్‌లను ఎన్నుకున్నారు. అలాగే బీసీ సెల్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు రాజేందర్‌గౌడ్, రవీందర్‌రావు, మండల నాయకులు కర్రె అశోక్‌రెడ్డి, ఎబ్బాసీ, సురేష్, నాగరాజు ఉన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా..



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

భూపాలపల్లి రూరల్: కాలనీ అభివృద్ధికి కృషిచేశానని రానున్న రోజుల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆశీస్సులతో మరింత అభివృద్ధి చేస్తానని వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో పదవి కాలం పూర్తయిన సందర్భంగా కాలనీవాసులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్‌దాట్ల శ్రీనివాస్ దంపతులను సన్మానించారు.

బ్యానర్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల/టేకుమట్ల: ఎన్నికల కోడ్ వచ్చిన మండల కేంద్రంలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను అధికారులు తొలగించకపోవడంతో 'సాక్షి'లో 'ఎన్నికల కోడ్ వర్తించదా?' అనే శీర్షిక శుక్రవారం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించి బ్యానర్లను తొలగించారు.



చిట్యాల: బ్యానర్లు తొలగిస్తున్న సిబ్బంది



టేకుమట్లలో..